"శాంతాదేవీ!!!"

జనసమూహపు సందడిలో నుంచి కేక విన్న శాంతాదేవి హఠాత్తుగా ఆగిపోయింది. భూతకాలంలో నిపూర్వాధ్యాయంతో పరిచయమున్న కంఠస్వరం అది. ఆ కంఠస్వరం ఆమె నవనాడులలోను భయం, వుత్సాహం నింపివేసింది. చేతిలో సూట్‌కేస్ జారిపోయిందన్న విషయం కూడ మరచిపోయి కేక వచ్చిన వైపు చకచక అడుగులు వేసింది. వేస్తున్న అడుగులు వేగాన్ని తగ్గించుకొని కొంచం సేపటికి ఆగిపోయాయి. ఆగిపోయినచోటులో ఆరడుగుల వ్యక్తి నిల్చుని వున్నాడు. ముఖం ఎర్రరంగు పులుముకొని వింత ఆకర్షణ తెచ్చుకొంటూ వుంది. బలిష్టమైన శరీరం ఆ ఆకర్షణకు చేయూతయిస్తూ వుంది. ఆ వ్యక్తి వయస్సు ఓ యాభై సంవత్సరాలు వుండి వుండవచ్చు..

ఆ వ్యక్తిని నఖశిఖపర్యంతం తనివి తీరా మరోసారి చూసింది శాంతాదేవి. ఆమె చూస్తున్న ప్రతి చూపులోను అర్థంలేని ఆవేదన, ఆకృతిలేని ఆవేగం కలసి పొంగుతున్నాయి. ఆమె కన్నులలో నీళ్లు గిర్రున తిరిగాయి. తన కన్నీళ్లు ఎదుటగా నిలబడిన వ్యక్తికి అగుపడకుండా తలవంచుకొంది. అయినా కన్నీటి బిందువులు జలజల క్రింద రాలాయి.

"ఏడుస్తున్నావా శాంతా?'

ఆ వ్యక్తి ప్రశ్న విని కాదన్నట్లు తల ఆడించింది. మాట్లాడాలని గొంతు విప్పింది గాని అతి సంతోషము, అతి విషాదము పొంగుతున్న హృదయంలో నుంచి వచ్చిన తెర కంఠస్వరాన్ని కప్పివేసింది.

"శాంతా! నీ కోసం అయిదు సంవత్సరాల నుంచి అన్వేషిస్తున్నాను. నేను కోరుకున్న జీవితానికి వెలుగు, అర్థం అయిదు సంవత్సరాల క్రితమే తెలిసింది, అప్పటినుంచి అన్వేషించుతూ వుంటే యిప్పుడు కన్పించావు. యిప్పుడే కాదు, మరో పది సంవత్సరాల తర్వాత అయినా యింతే సంతోషం పొంది వుండేవాడిని."

బరువుగా జీరను దొర్లించుకుపోతున్న ఆ కంఠస్వరం విని శాంతాదేవి గంభీరం వహించింది. ఆయన ముఖంలోకి మరోసారి చూసింది. ప్రస్ఫుటంగా వెలుగుతున్న కన్నులలో వాత్సల్యము, ప్రేమ చల్లగా సాగుతున్నాయి. ఆ చల్లదనం అనుభవంలోకి తెచ్చుకొని ఆమె అధీరురాలయింది.

"మధుబాబూ" ఆమె పిలుపు కొంచం తొట్రుపడింది. పైగా పలుకుతున్న పెదవులు ఆంతర్యంగాను, బాహ్యంగాను కూడ ఏదో వెతికాయి. ఆ వెతకటంలో కొంత భయం కల్గిందికాని వెంటనే అణచివేసింది.

"ఏమిటి శాంతా నీ పెదవులు అదురుతున్నాయి? నీ కన్నులు ఎందుకో వుబుకుతున్నాయి. నాకు దుఃఖం కల్గినపుడు కుడి చెంప అదిరేది. యిప్పుడూ అలాగే వుంది. నీకు అగుపడి తప్పు చేశానా శాంతా? చెప్పు శాంతా నీకేకాదు, యీ కాలానికి కూడ కనబడకుండా వెళ్లిపోతాను." ఆ మాటలలో అభ్యర్థన, ఆవేదన నిశ్చలత శాంతాదేవిని మరింత అధీరురాల్ని చేశాయి

"నేను బాధపడటంలేదు మధూ. తన ఆంతర్యం ఎటువంటిదో తెలుసుకోలేదు స్త్రీ. అయినప్పుడు నేను ఏమి చెప్పను? నీతో మాట్లాడాలి. అలా కృష్ణ ఒడ్డుకు పోదాంపద"

ఆయన శాంతాదేవి వంక చూచి తలూపాడు. క్రిందపడిన సూట్‌కేసును అందుకొని శాంతాదేవి చేతిని తీసుకొని రోడ్డు మీదకు వచ్చాడు. ఎదురుగా వచ్చిన టాక్సీని పిలిచి అందులో కూర్చున్నారు. టాక్సీ సున్నని రోడ్డు మీద దూసుకుపోతోంది. శాంతాదేవి ఎక్కడో ఆలోచిస్తూ వుంది బయటకు చూస్తూ. మధుబాబు శాంతాదేవి ముఖం వంక పరిశీలనగా చూసాడు.

తను జీవితంలో సగభాగం దాటి వచ్చేశాడు అని తెలుసు. కారులానే కాలం కూడ దూసుకుపోతూ వుంటే తను దాహంతో వెంట పరుగెత్తాడు. దాహంతో సాగిన జీవితంలో యింతవరకు దొర్లిన క్షణాలు తనకు వుపయోగపడ్డాయా? లేక తనను వుపయోగించుకున్నాయా? ఆయన మరల శాంతాదేవి వంక చూశాడు. ఆవెకు నలభై ఐదేళ్లు వుండి వుండవచ్చు. ఆమె ముఖం మీద చిన్నచిన్న ముడుతలు అగుపడుతున్నాయి. చెంపలు తెల్లగా పాలిపోయాయి.

తల మోది [illegible] ఆ దుఃఖాన్ని నీ [illegible]?"

తెల్లగా నెరసినట్లున్నాయి. కాని ఆయనకు ఆమె కళ్లల్లో పాతికేళ్లనాటి కాంతి, వెలుగు అగుపడుతున్నాయి. పాతికేళ్లు దాటి పోయినప్పటికి ఆమె పాతికేళ్ల శాంతాదేవి గానే అగుపడుతోంది ఆయనకు.

మరోసారి ఆమె వంక చూచి పిలిచాడు "శాంతాదేవీ" ఆ పిలుపు ఆమెకు వినబడ లేదు. ఆలోచన మిగిలిన ప్రపంచాన్ని మర పింప చేస్తుంది. అందుకు అంతరాయం కల్గించదలచుకోలేదు ఆయన.

దూసుకుపోయినకారు కృష్ణకు దూరంగా ఆగింది. కారు దిగి యిద్దరూ ఒడ్డు వరకు నడుస్తూ వెళ్లి కూర్చున్నారు. మధు బాబుకు ఎదురుగా కూర్చున్న శాంతాదేవి మోకాళ్ల మీద తల ఆనించి చేతి వేళ్లతో అప్రయత్నంగా యిసుకలో పిచ్చిగీతలు గీస్తోంది. తన చేతులు ఏమి చేస్తున్నాయో ఆమెకు తెలియదు. మెదడులో ఒకేఒక ఆలోచన 'ఝుం' మని మోతతో గంతులు వేయసాగింది.

సంధ్యా కన్నియ పైట కప్పుకొంటోంది చిరునవ్వుతో. పశ్చిమాద్రిన దాగుకొంటున్న సూర్యుడు ముదురు గులాబి రంగును తన ముందు భాగమంతా వెదజల్లి తొంగి తొంగి చూస్తున్నాడు నీలి ఆకాశం మీద అక్క డక్కడ పరుచుకున్న మబ్బుతునకలు చిత్ర కారుడు గీసిన తెల్లనిరేఖలులా వున్నాయి ముందు గంతులు వేస్తున్న కృష్ణ తరంగాలు, చుట్టూ పరుగులు తీస్తున్న పిల్లగాలులు, భావాలు తొందర పెడ్తున్న మనసు

"శాంతాదేవీ!!" ఆ పిలుపులో ఎన్నో మధురస వాహినీలు, ఎన్నో వాత్సల్య స్రవం తులు దొర్లిపోయాయి. ఆ పిలుపుకు మరోసారి అధీరురాలయింది శాంతాదేవి

"ఊఁ" అని పలికింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు? నన్నుగురించేనా?"

"కాదు, నన్ను గురించే జీవితపు చివరి మజిలీలో ఎదురుపడ్డ అతిథికి యివ్వటానికి యీ పూజారిణి దగ్గర ఏమి వుందా అని ఆలోచిస్తున్నాను"

"నీ నుంచి ప్రతిఫలాన్ని కోరే అతిథిగా కాకుండా ఆత్మీయతను అందించమనే యాచ కుడిగానే వుండగలను."

"మధుబాబూ!!"

"అవును శాంతాదేవీ! ప్రతిఫలాశలో స్వార్థం వుంది. స్వార్థంతో దుఃఖం వుంది.

"నన్ను అధీరురాల్ని చేస్తున్నావు మధు బాబూ"

"కాదు, జీవితంలో పొందివ్వ పొందా ననుకున్న వెలుగును నీ ముందు వుంచటానికి ప్రయత్నిస్తున్నాను."

కొంచెంసేపు అక్కడ నిశ్శబ్దం వ్యాపిం చింది. కనీసం అలల నాదంగాని, పిల్ల గాలులు సవ్వడిగాని లేదు. వాళ్లిద్దరూ ఒకరి వంక ఒకరు చూసుకొంటున్నారు. నాలుగుకళ్లలో తిరుగుతున్న గాథలను, భావాలను కాలం గాలంవేసి వెనక్కి లాగాలని ప్రయత్నం చేస్తూ వుంది. అయితే ఓడి పోయిన కాలం ఆ నాలుగు కళ్ల మధ్య నిలువ లేక కాలూలు ఎక్కడికోపోయింది. కొంచం సేపటికి శాంతాదేవి నెమ్మదిగా అడిగింది "యిప్పుడు. యీ చివరి అధ్యాయంలో ఎందుకు వచ్చావు మధుబాబూ?"

"కాలం నీ ముందుకు తరిమింది. ఆరా ధన పరుగెత్తించింది."

"కాని యిప్పుడు నాదగ్గర ఏమీ మిగలలేదు కాలం వెంట లాక్కుపోయి నలభై ఐదేళ్లు తెచ్చిపెట్టింది ప్రకృతి వయస్సును కరిగించింది సంఘం చాల బాధ్యతలను నెత్తిమీద వేసింది. వీట న్నిటిని తప్పుకొని నీకు స్వాగతం యిచ్చే పరిస్థితిలో లేను నేను. యిప్పుడు నాదగ్గర నుంచి ఏమి పొందాలనుకున్నావు? సూటి గానే జవాబు కావాలి"

ఆయన ఎర్రనిముఖం గంభీరం వహిం చింది ఆయన ఆ పెదవుల మీద చిరునవ్వు యింకా వెలుగుతూనే వుంది ముఖంలో రెండుభావాల రంగులు పులుముకున్న తర్వాత అన్నాడు మధుబాబు "శాంతాదేవీ వీటనన్నిటిని మించి నీకు హృదయం వుంది పాతిక సంవత్సరాల నుంచి ఒక జ్యోతి, నీ హృదయంలో వెలుగుతూ వుంటుందనే నా నమ్మకం ఆరాధన ఆ జ్యోతికి ఆహారం అందించుతుంది యీ నిరంతర అన్వేషణలో నుంచి తప్పుకొని ఆ వెలుగు చల్లదనాన్ని అనుభవించుదామనే వచ్చాను"

"నేను వయస్సు మళ్లినదాన్ని సంఘం చేసిన వివాహపు మజిలీలో చేరి అన్నీ పోగొ ట్టుకొని, దాని ఛాయలు మాత్రం వెంట వేసుకొని నడిచేదాన్ని. ఆ ఛాయలు నిన్ను యింకా ఆరాధించటానికి అవకాశం యివ్వవు మధూ! నేను స్త్రీనన్న విషయం నువ్వు మరచిపోకూడదు."

నా మధుబాబు నవనాడులు క్రుంగిపోయే ఆమెమాటలు. ఉవ్వెత్తుగా లేచిన తరంగం ఒకటి తిరిగి క్రిందపడింది. వివాహం .దాని మీద కసి ఏర్పడింది ఆయనకు కాని తను? తనకున్న అధికారం? యీ సంఘం యివ్వలేదు. ఆ భవనం ఆహ్వానించలేదు.

"క్షమించు శాంతా! ప్రకృతి నియ మాలు, సంఘం చేసిన చట్టాలు మనిద్దరి మధ్య అడ్డుగోడకడ్తాయని అనుకోలేదు. యింతవరకు సాగిన జీవితంలో ఆలోచించ నిది అదేకూడ. నీకు నలభై అయిదేళ్లు. నాకు యాభై ఏళ్లు. మనిద్దరి మధ్య ఆరాధన వుందని అంటే నవ్వన్నట్లు ఎవ్వరూ హర్షింతరు. ఏ నియమము అక్షిం తలు వేయదు. యీ విషయం నాకు తెలుసు కాని, అంతకుమించి..." ఆపైన ఆయనకు మాటలు రాలేదు గొంతు జీరవేసుకొని పూడిపోయింది. "ఏమీలేదు. ఏమీలేదు. అంతే..." అన్నాడాయన చివరకు ముఖం గంభీరంగా రంగు పులుముకుంది. కనులు కొంచెంగా ఎర్రబడ్డాయి. కనురెప్పలు, మాటమాటకి అదురుతున్నాయి ఆయన వంక అలాగే చూస్తూ వుండిపోయింది, శాంతాదేవి.

కొంచం సేపటికి శాంతాదేవి అడిగింది. "నా నుంచి నువ్వు కోరుకొనేది అర్థం కావటంలేదు"

"నీకు ఎప్పుడో అర్థమయింది సంఘం వెనుక, ప్రకృతి ముందు చేతులు కట్టి నిలబెట్టిన అనుభవం నిన్ను అలా అడిగి స్తుంది నేను నీ నుండి కోరేది ఒకే ఒక వెలుగు పాతిక సంవత్సరాలునాటి ఒకే ఒక్క క్షణం ఆ వెలుగు ఆ క్షణం నువ్వు యివ్వ గల్గితే తృప్తిగా చావగలను. యివ్వక పోయినా చావగలను, ఎందుకంటే చావు కోరికలు తీరినా తీరకపోయినా ఆహ్వానించేదే"

"మధూ! నువ్వడిగిన క్షణాన్ని గురించి నేను ఆలోచించుకోవాలి"

"తప్పకుండా ఆలోచించు. ఆలోచన అభిప్రాయానికి నిశ్చలతను కొనియిస్తుంది"

శాంతాదేవి కృష్ణనది వంక శూన్య దృష్టులతో చూడసాగింది. ఆమె ముందు చాలా ఆలోచనలు పరుగెడుతున్నాయి.. సంఘం ప్రకృతి— కాలం— నియమాలు —కర్తవ్యాలు—వయస్సు—హృదయం-ఆరా ధన—ప్రేమ .అన్నీ పొంగుతున్నాయి అన్ని, పూర్ణబిందువుల మాదిరిగా ఒకదాని వెంట ఒకటి వున్నాయి. కాని ఆ బిందువులో

తెలియటంలేదు. ప్రతిబిందువు వద్ద ఎంతో కొంత శాంతి వున్నట్లుగా వుంది. ఆశాంతి స్థలానికి తడబడుతూ అడుగులు వేసుకొంటూ వెళ్ళి మరల వెనక్కి తిరిగి చూస్తుంది. అది స్త్రీకి అలవాటు కూడ కావచ్చు.

ఆరాధన దీనికి ఆది ఎక్కడో, అంతం ఎక్కడో అర్థం కాలేదు. ఆ ప్రవంతిలోని చల్లటి జలాన్ని చవిచూచినపుడు కలిగే సుఖం బహుశా జీవితంలో మరెక్కడా దొరకదేమో

నలభై అయిదేళ్ళు పొందిన స్త్రీ మాతృత్వానుభవంలో రెండు బిందువులను మిగుల్చుకున్న స్త్రీ ఆరాధన తెరచాటున విశ్రాంతి తీసుకోటం పాపమా? మోసమా? యీ రెండు పదాలకు అర్థంలేదు అయినా యీ లోకం ప్రవేలెత్తి చూపుతుంది.

తను వివాహిత. విధవ. తన సంస్కార జీవితంలో తన భర్తను ప్రేమించిందా? బహుశా లేకపోవచ్చు. కాని కర్తవ్యం నిర్వహించింది కర్తవ్యం వేరు, ప్రేమ వేరు ఆరాధనవేరు వీటన్నిటికి ఒకేరకమైన నియమాలు, ఒకేరకమైన మజిలీలు వుంచాలనుకోవటం పిచ్చి, తెలివితక్కువ

ఆలోచించుతూ ఎదురుగా చూచింది శాంతాదేవి. మధుబాబు ఆమె వంకే చూస్తున్నాడు గంభీరమైన చిరునవ్వు ముఖం మీద నిలుపుకొని. ఆయన అలా చూస్తూ వుంటే ఆమె తెల్లగా పాలిపోయిన చెంపల మీద సిగ్గు దొంతర్లు అప్రయత్నంగానే దొర్లి ఎర్రరంగును పులిమాయి. తెల్లని చెంపల మీద ఎర్రరంగు కలుపుకొనే దృశ్యాన్ని చూచి ఆ చల్లదనాన్ని అనుభవించాడు మధుబాబు.

శాంతాదేవి ఏమిటి ఆలోచిస్తున్నావు?" అడిగాడాయన.

"ఆరాధనను గురించి"

'జీవితానికి వెలుగు కాలానికి అందం, మనసుకు మెరుగు యివ్వగల్గింది అదే ఆరాధన నన్ను యింతకాలం బ్రతికించింది.. లేకపోతే అయిదు సంవత్సరాల క్రితమే చచ్చిపోయేవాణ్ని."

"ఆరాధనకు పునర్జన్మ వుందంటావా?" ఆ ప్రశ్న అబద్ధమని ఆమెకు తెలుసు. అయినా అడగటంలో కుతూహలం చూపించింది

"అసలు ఆరాధనకు మరణం లేదు శాంతా! సమాంతరంగా సాగుతున్న కాలం, వలయంగా తిరుగుతున్న జీవితం, విశాలంగా పరుచుకున్న ప్రపంచం అన్నీ యీ ఆరాధన యిరుసు మీద తిరగవలసిందే.'"

సంజె చీకట్లు ముసురుకొంటున్నాయి. కృష్ణా అలలు చల్లగాలికి కన్నె నడుములా కదులుతున్నాయి నిశా కన్నియ నవ్వటానికి యత్నిస్తోంది.

"ఒక్కసారి యింటికి రాకూడదూ?" ఆయన కళ్ళల్లోకి చూస్తూ అంది శాంతాదేవి ఆ మాటకు ఆయన వులిక్కిపడ్డాడు.

"రాగలను కాని ఆ సన్నివేశం నీ జీవితాన్ని పెకలించి వేస్తుంది."

"కావాలని బలహీనురాలిని చేస్తున్నావా?" "కాదు"

కొంచెంసేపు శాంతాదేవి ఏమీ మాట్లాడలేదు. కొన్నిక్షణాలు దొర్లిన తర్వాత అడిగింది.

"యిప్పుడు నువ్వెక్కడ వుండటం?"

"హోటలులో" హోటలు పేరు చెప్పాడు ఆయన ఆ పేరును రెండుమూడు సార్లు మనసులోనే అనుకొంది శాంతాదేవి.

కొంచెంసేపటికి "వెళ్తాను" అని, లేచింది శాంతాదేవి.

"నా అభ్యర్థనకు జవాబు రాలేదు"

"జవాబు కోసం నేను చుట్టుప్రక్కల అన్వేషిస్తున్నాను. దొరికిన జవాబులో నమ్మకం ఏర్పడితే నీ దగ్గరకు పరుగెత్తుకు రాగలను నమ్మకం కల్గకపోతే మిగిలిన కొద్దిపాటి జీవితంలో ఎక్కడా అగుపడను." అని జవాబు కూడ ఆశించకుండా టాక్సీ వైపు వెళ్ళిపోయింది. మోకాళ్ళ మీద తల ఆన్చి ఆమె వెళ్ళిన వంకే చూస్తూ వుండిపోయాడు మధుబాబు.

* * *

కాలం పాతిక సంవత్సరాల వెనుకకు పరుగెత్తి పక్షిలా వాలింది. చల్లని వెన్నెల, అందులో యిమిడిపోయిన తరుచ్ఛాయ. వెన్నెల నీడల పరిష్వంగం మధ్య, చల్లని నునువెచ్చని అనుభూతుల మధ్య యిమిడిపోయి ఆరాధన జ్యోతి వెనుక నిలబడ్డ శాంతాదేవిని చూశాడు మధుబాబు. మధుబాబు వంక చూసింది శాంతాదేవి. రెండు హృదయాలలోను ఏదో భావం పొంగుతున్నాయి. తెలియని భావంతో తీయని అనుభూతి మనక తెరవేస్తోంది.

మధ్యన ఆరాధన అల్లుకున్న చక్కటి వాతావరణం

రెండు హృదయాలు కలసి అనుభవించిన అనుభూతి కాలం సమీపంలో లేదు. జీవితాలకు అందనిదిలేదు. యిద్దరూ చాల విషయాలను మరచిపోయారు. ఆమె మెడకు రొమ్ముకు మధ్య నునువెచ్చని ముద్దులతో నవ్వు—నవ్వులో వెలుగు—వెలుగు చాటున దాగిపోయిన యిద్దరూనూ

ఆమె హృదయపు లోతు, ఆరాధనలోని గతి జీవితానికి ప్రగతిని బోధించాయి.

ప్రగతి వైపు తొంగి చూడగానే పిపాస కల్గింది వెనుకవైపు నిరీక్షించగల ఓర్పు అగుపడ్తోందికాని, ముందు వైపు చూడగానే దాహం కల్గసాగింది. ప్రగతి బిందువుగా నిలబడి ఆహ్వానిస్తోంది

వెంటనే రెండు ధారలు సమాంతరంగా సాగాయి ఆరాధన, రెండోది జీవితం. జీవితం జయించి ముందుకు దూకింది.

అన్వేషకుడుగా, తీరని దాహంతో, జీవితానికి వెలుగు నింపుదామని బయలుదేరిన రోజున అతడు అటు యిటు చూశాడు. నిశ్శబ్దం నిక్కగా పరుచుకొని వుంది ఆరాధనకు సాక్షిగా నిలిచిన తరువు గంభీరం వహించింది

చిక్కగా పరుచుకున్న నీడలో శాంతాదేవి వంక చూస్తూ అన్నాడు మధుబాబు. "మనిద్దరి హృదయాల నుంచి వచ్చిన భావాలకు సంఘం నిర్ణయించిన పెళ్ళి ఆశ్రయం యిస్తుందనుకోను విశాలత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని నియమాల యినుప తీగల మధ్య బంధించిన యీ సూత్రాలను చూచి భయపడవలసిన అవసరంలేదు. నా జీవితం ఒక యాత్రికునిలా దొర్లిపోయి వెలుగును పొందాలి మరల నేను నీ దగ్గరకు వచ్చి నిలబడితే యిప్పుడున్న జ్యోతిని అందివ్వగలననుకుంటాను."

శాంతాదేవి చాల గంభీరం వహించి అంది "కాలం, సంఘం స్త్రీని నిలువనీయవు. సైగా యీ జ్యోతిని యింటిలో చాటున దాచుకోమని హెచ్చరిస్తుంది అయినా వాటిని అధిగమించి జ్యోతిని నీకు చూపించగలను'.

కృతజ్ఞతతో మెరిసిన కళ్ళు ఆమెకేసి తిప్పి, వెనుతిరిగి జీవితపథాన్ని అనుసరించాడు ముందుకు సాగుతున్న తన నీడలను గమనించుతూ ఆ నీడలు అలా వున్నంత వరకు అతనికి నాలుగు కళ్ళు నాలుగు

విదివులు విద్యా దాని సంస్కృతి గురుత్వాకర్షణ వస్తున్నాయి.

గాహంతో సాగిన జీవిత పథం మీద అనేక చల్లని మజిలీలు, కాంతిపుంజాలు లభించాయి. రెండు రిసెర్చి డిగ్రీలు, రెండు విదేశీయాత్రలు, అనేక స్కాలర్‌షిప్పులు, పట్టాలు, సన్మానాలు చాల జరిగాయి. తృష్ణలో నుంచి వెలిగిన జీవితం వాటిని చూచి కొన్ని సంవత్సరాలు పొంగొట్టుకొందను కోలేదు పొందిందనే అనుకొంది.

గదిలో కూర్చొని ఆలోచనతో కుర్చీ పట్టు పొగింది శాంతాదేవి. గదిలో వున్న దీపం ఆరి వెలుగుతూ వుంది. వెలిగి ఆరిపోతూ వుంది.

తనకు యిప్పుడు నలభై అయిదేళ్ళు. పెళ్ళిలాంటి పాతగుడిసెలో ప్రవేశించి కొంత కాలానికి అందులో 'ఏమి మిగిలింది అని వెతుక్కొంటే ఆరాధనాజ్యోతి అగుపడలేదు. కాని, సంఘం, తనకు జన్మ యిచ్చి, లోకాన్ని చూపించిన పెంపుడు మమతలు బలవంతంగా ఆ గుడిసెలోకి నెట్టాయి. మొదట అందులో ప్రవేశించిన తరువాత వాన కురుస్తూ వుండగా వెళ్ళి తలదాచుకొన్నట్టుగా వుంది. తరువాత బయటకు వద్దామని అనుకొంది. కాని అందులోని నియమాలు తన చేతులు పట్టి వెనక్కి లాగుతూ వుంటే ఆమె ముందు అడుగు వేయలేకపోయింది.

తను భర్తను ఆరాధించలేదు. ప్రేమించింది. కామించింది కర్తవ్యాలు నెరవేర్చింది. వీటన్నిటిని మించిన ఆరాధన జ్యోతి దూరంగా వెలుగుతూనే వుంది. ఆ జ్యోతి వరకు వెళ్ళి నూనెపోసి వత్తిని పైకి తీద్దామని అనుకొంటే అంతర్యాన్ని కొలవలేని కొన్నిసూత్రాలు చేతులు చాచి అడ్డుగా నిలబడ్డాయి.

మాతృత్వాన్ని పొందింది. ప్రకృతి పంచిందిదనుకొంది. అలాగే చేసింది కూడ. అయితే పిల్లల్ని ప్రేమించింది. పెంచింది. అయినా దూరంగా వెలుగుతున్న జ్యోతి వంక చూస్తూనే వుంది.

వైధవ్యం ఎదురుపడింది. కళ్ళల్లో నీళ్ళులేవు. హృదయంలో అనుభూతిలేదు. భర్త జీవిత పథంలో ఎదురుపడి కొంచం సేపు మాట్లాడి ప్రక్కకు తప్పుకుపోయిన పాంథుడిలా అగుపడ్డాడు అందుకే కన్నీళ్ళు లేవు. కన్నీళ్ళు లేకపోవటానికి కారణాలు సంఘం గుచ్చి గుచ్చి అడిగింది. తను ఏడ్వలేదు. ఏడ్వాలనుకోలేదు.

ఆ ఆరాధన జ్యోతి వెలుగుతో ఈరోజున ఎదురుపడింది. అయితే ఆమె ఆ వెలుగులో ఆత్మపరిశీలన చేసుకొంటోంది. తన నొకపూజారిణిగా భావించుకొంటోంది. అతిథికి యివ్వటానికి ఏమీ మిగలలేదని పశ్చాత్తాప పడుతోంది.

అనేకరకాలుగా ఆలోచించుకొంటూ పచార్లు చేస్తోంది ఎదురుగా రాధామాధవుల చిత్రం వుంది తమాల వృక్ష ఛాయలలో— ఆరాధన వెలుగును కళ్ళల్లో నింపుకొని, ఆంతర్యపు ఆవేశాన్ని శరీరాలలో యిముడ్చుకొని ఒకరి కౌగిలింతలలో మరొకరు వున్నారు.

రాధ...స్త్రీ. తరతరాల స్త్రీవాహిని.

అరమోడ్పు కన్నులతో ఆ చిత్రం వంక చూచింది శాంతాదేవి కృతజ్ఞతను నింపుకుని రాధ వివాహిత. ఆమె హృదయంలో నివసించింది భర్తకాదు, కృష్ణుడు. రాధా హృదయమే కృష్ణుడి శాంతినిలయము వివాహితయిన యిద్దరి వేర్వేరు స్త్రీపురుషుల ప్రేమను సర్వప్రపంచము, సర్వసృష్టి ఆశీర్వదించింది. ఎవరూ విమర్శించలేదు.

ఆరాధనకు నిషిద్ధాలు, నియమాలు వుంటాయనుకోవటం తెలివితక్కువ అనుకొంది శాంతాదేవి.

ఆగదిలోనే మరొక ఫోటో వుంది. మీరా. విషం నిండిన పాత్రను కనుల ముందు పెట్టుకొని తన ఆరాధన దేవత ప్రతి, రూపాన్ని వెతకటానికి ప్రయత్నిస్తోంది. మీరా చేస్తున్న ప్రయత్నంలో చేయూత యిచ్చేది ఏమిటో శాంతాదేవికి తెలుసు. మీరా వివాహిత. అయినా మరో మగవాణ్ని ఆరాధించింది.

మీరా—రాధ యుగ యుగాల స్త్రీత్వానికి ప్రతినిధులు — ఆరాధనా జ్యోతులకు ప్రమిదలలాంటి ప్రమదలు వారు.

మరొక క్రొత్త వెలుగు శాంతాదేవికనుల యందు నిల్చింది. ఆ వెలుగునకు దూరంగా నిలబడిన సంఘం—వివాహ వ్యవస్థ మాతృత్వం —నియమాలు — కర్తవ్యాలు చివరకు సెక్సు కూడా హీనంగా చూస్తున్నాయి.

కొంత వెలుగును వెంటవేసుకొని బయటపడి చక చక అడుగులు వేసుకొంటూ హోటల్ చేరింది మనసుకన్న వేగంగా పోయిన చేతులు గది తలుపు తీసుకొని లోపలకు వెళ్ళింది గదిలో అంతా చీకటిగా వుంది. చీకటిలో నలుమూలలకు దృష్టులను సారించింది. మంచానికి ఆనుకొని క్రింద కూర్చొని ఆలోచిస్తున్నాడు మధుబాబు.

వెంటనే లైటు వేసింది. గదినిండా వెలుతురు పులుముకొంది. మధుబాబు ఉలిక్కిపడి అడిగాడు "ఎవరు?"

"నేనే"

శాంతాదేవివంక కొన్ని క్షణాలు అలాగే చూస్తూ నిలబడిపోయాడు.

"ఏం? ఆశ్చర్యపడుతున్నావా?

"లేదు, సంతోషిస్తున్నాను. కాని, ఇంత రాత్రివేళ నిశ్చయంగా ఎందుకు వచ్చావు?"

"నా నిర్ణయం తెలియచేయటానికి"

"ఏమిటది?"

"ఇప్పుడుకాదు, రేపు అయిదు గంటలకు కొండమీదకురా."

"ఈ నిర్ణయం చెప్పటానికి అంత దూరంనుంచి ఒంటరిగావచ్చావా?"

"భయంలేదు. కాలమేకాదు, ఆలోచన కూడ స్త్రీని తరుముతూ వుంటుంది."

మధుబాబు నవ్వుకున్నాడు. మరల తలఎత్తి చూసేసరికి శాంతాదేవి అక్కడలేదు. తలుపులు దగ్గరకులాగివున్నాయి.

ఆమె వెలిగించిన వెలుగులో మరోసారి నవ్వుకున్నాడు మధుబాబూ.

* * *

"శాంతీ" భర్త పిలుపు

"అమ్మా" కొడుకు అరుపు

"శాంతీ"

"అమ్మా"

కర్తవ్యం ఎదురుతిరిగింది. మాతృత్వం స్పందించింది. గదిలో ప్రతిధ్వనిస్తున్న కేకలకు కారకులు ఎవరూలేరు అక్కడ కాని, శాంతాదేవి హృదయం చిల్లులు పడేట్లుగా వినిపిస్తున్నాయి పిలుపులు

చెవులు మూసుకొని గదిలో నలువైపుల చూచింది. ఎదురుగా తన ప్రతిబింబం— అద్దంలో తనరూపం అగుపడింది. ఆ



కూడా ఆమె కళ్లకు కట్టినట్లయిందేళ్లా స్త్రీగానేడు పాతిక సంవత్సరాలు వెనుకకు వెళ్ళిపోయింది ఆమె హృదయంలో తెలియని ఆవేశం—అర్థంకాని ఆవేశం సాహసంతో కూడుకొని ఉప్పెనలా ముందుకు విరిగిపడుతున్నాయి.

ఆ ఆవేశంతోనే గోడమీదకుచూచింది. అక్కడ భర్త ఫొటో వ్రేళ్లాడుతోంది.—ఆ ఫొటోను చూడగానే ఆమె ఆత్మను, హృదయాల్ని పిండిగాచేసి గాలికి ఎగురకొట్టినట్టుగావుంది. వెంటనే ఆమె కళ్లల్లో నీళ్లు కూడా తిరిగాయి.

తెర తెరలుగా సాగుతున్న యీ పాతికేళ్ల జీవితంలో తను ఏమి పొందింది?

భర్త ప్రేమా?

మాతృత్వమా?

సంఘం యిచ్చిన మంచితనమా?

మొదటి రెండూ తనకు అనుభవమే ఆ రెండూ తనని జయించలేవు. యికపోతే, సంఘం తనని విమర్శించుతూనేవుంది. చచ్చిపోయిన తర్వాతకూడ విమర్శించుతుంది.

భర్తని ప్రేమిస్తూ ఆరాధనవంక చూచింది.

కర్తవ్యాల్ని నిర్వర్తిస్తూ ఆరాధనవంక చూచింది.

మాతృత్వాన్ని పొందుతూ ఆరాధనవంక చూచింది.

ఫోటోముందు నిలబడి తలవంచింది. రెండు కన్నీటి బిందువులు ఆమె కన్నులలోనుండి జల జల క్రిందకురాలాయి. వెంటనే ఫోటోవంక చూచి రెండు చేతులుజోడించి అంది "ప్రభూ! స్త్రీలో రెండు స్రవంతులు పొంగటం పాపంకాదు. జీవితపు చివరి అధ్యాయంలో ఎదురుపడిన అతిథికోసం అన్నిటిని అధిగమించి వెళుతున్నాను. క్షమించు."

కొంచెం సేపు అలాగే నిలబడి బయటకు వచ్చింది. బయట వరండాలో పెద్ద కొడుకు చక్రధర్ వాలు కుర్చీలో పండుకొని పుస్తకం చదువుకొంటున్నాడు. చప్పుడు చేయకుండా మెల్లిగా వరండా మెట్లుదిగి క్రిందకు వచ్చింది. చప్పుడు చేస్తే 'అమ్మా' అని పిలుస్తాడు చక్రధర్. ఆ పిలుపులోవున్న కర్తవ్యాలు తన కాళ్లకు యినుప సంకెళ్లు వేస్తాయి. అయినా తను వెనుకడుగు వేయదు.

కాని వెళుతున్న ఆమె అడుగులు హఠాత్తుగా ఆగి పోయాయి "అమ్మా... అమ్మా ఎక్కడికి వెళుతున్నావు? నువ్వు లేకపోతే మేము చచ్చి పోతాము......"

యుగధార

వెళ్లకమ్మా" ఎవరో వచ్చి ఆమెను చుట్టి వేసినట్లు, కాళ్లకు పెనవేసుకున్నట్లుగాను వుంది. కొంచెం సేపటికి తేరుకుని చూస్తే అక్కడ ఎవరూ లేరు. చక్రధర్ కుర్చీలో పడుకొని పుస్తకం చదువుకొంటున్నాడు.

గుండెలవేగాన్ని తగ్గించి, ముఖాన పట్టిన చెమట బిందువులను తుడుచుకుని వడివడిగా అడుగులు వేసింది.

సూర్యుడు కొండ చాటుకు పూర్తిగా వరిగి పోయాడు. ఒక్కొక్క మెట్టే ఎక్కుతున్న శాంతాదేవికి చివరి మెట్టు ఒక్కటే గమ్యంలా అగుపడుతోంది. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూవుంటే 'తన' అనే ఒక్కొక్కదాన్ని వదలి వేసినట్లుగా వుంది. మెట్ల మధ్య వరకు వెళ్లిపోయిన తర్వాత ఆమె ఆగిపోయింది.

ఎదురుగా మధుబాబు నిల్చుని వున్నాడు. పై నుంచి సగం మెట్ల వరకు దిగి వచ్చాడాయన.

"పై నుంచి ఎందుకు దిగావు మధూ?" శాంతాదేవి అడిగింది.

"సగం మెట్లుదిగి నిన్ను పైకి తీసుకు వెళ్లటంలో కలిగే ఆనందం అనుభవిద్దామని" ఆ పైన శాంతాదేవి మాట్లాడలేదు. మధుబాబు శాంతాదేవి చేతిని తన చేతిలోకి తీసుకొని మెట్లు ఎక్కసాగాడు. శాంతాదేవి ఆయనను అనుసరించుతోంది. చివరి మెట్టు ఎక్కేసరికి ఆమె హృదయం, జీవితం, మెదడు—అన్నీ క్రింద వదలిపెట్టి వచ్చేసినట్లుగా వుంది శూన్యంగా నిలబడిన జీవితపు వాకిలి తెరచివుంది. అందులో ఆరాధనా స్రవంతి పొంగి పొర్లాలి.

యిద్దరూ కొండపైకి వెళ్లారు పైన ఆకాశం నీలిరంగు పులుముకొని నిర్మలంగా వుంది. కొండమీదవున్న చిన్న చిన్న పొదలు గంభీరం వహించాయి. క్రింద నుంచి పైకి వరకు పెరిగిన మెట్లు వెనక్కి తిరిగి చూచుకొంటున్నట్టుగా నిలబడ్డాయి.

వలు ప్రక్కల చూచింది శాంతాదేవి క్రింద ఎక్కడో తిరుగుతున్న మనుష్యులు చిన్న పురుగులులా అగుపడుతున్నారు వాళ్ల వంక జాలిగా చూచింది ఆమె. వాళ్లల్లోనే బాధ్యతలు, కర్తవ్యాలు—నియమాలు— సూత్రాలు— సంఘం అరుపులు అన్నీ కొట్టు కొంటున్నాయి.

వాళ్లవంక జాలిగా చూడటం తప్ప ఏమీ చేయలేదు శాంతాదేవి. ఆమెవంక క్రీగంట చూస్తూ ఆమె మెదడులో కదిలే ఆట ఏమిటో గమనించి అన్నాడు మధుబాబు "ఏమిటి ఆలోచిస్తున్నావు శాంతా!"

"ఏమీలేదు. కొన్ని గంటల క్రితం అతిథికి యివ్వటానికి ఎవ్వరూ ఏమీ మిగల్చలేదనిపించింది కాని అన్నీ నాఅంతట నేనే పోగొట్టుకున్నానని తెలిసింది."

"తరతరాల స్త్రీత్వం తరువాత వాళ్లకు యిచ్చిన వరమదే. జీవితంలో వెలుగుతున్న క్షణాల వెలుగులోనే అన్నీ పొందటం నేర్చుకోవాలి" అంటూ శాంతాదేవిని తన మీదకు లాక్కున్నాడు మధుబాబు. ఆ విశాల హృదయంలో ఏదో శాశ్వత శాంతిని వెతుక్కుంటూ వుంది శాంతాదేవి.

"యీ క్షణంలో వున్న అనుభూతిని జీవితపు గ్రంథంలో మొదటి నుంచి చివర వరకు వ్రాస్తాను శాంతా" ఆమె నడుము చుట్టూ చేయివేసి మరింత గట్టిగా తనకేసి అదుముకున్నాడు.

శాంతాదేవి ఆయనను పెనవేసుకుంది.

వయస్సు, అనుభవం వెకిలిగా నవ్వటం మానివేసి ఏదో గొణుక్కుంటూ చాటుకు తప్పుతున్నాయి.

యుగధార వాళ్లిద్దర్ని తడిపి ముందుకు దొర్లింది.

అందులో నుంచి వెలిగిన జ్యోతి బొమ్మరిల్లులాంటి నాలుగు రాళ్లమధ్య దివ్యంగా వెలుగుతూ వుంది. ●